

సరిహద్దుల వద్ద మరింత నిఘా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నాటసారా, కర్నాటక మద్యం, ఇసుక అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా జిల్లాలోని సరిహద్దుల వద్ద నిఘాను మరింత పెంచాలని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి కెవి.రామకష్ణ ప్రసాద్ సెబ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక పోలీస్ కార్యాలయం నుంచి జిల్లాలోని సెబ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత సంవత్సరం పనితీరు, ఫలితాలపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాష్ట్ర సరిహద్దులు, జిల్లాలోని వివిధ ఎక్సైజ్ చెక్‌పోస్టుల వద్ద నిఘాను మరింత పెంచాలని సూచించారు. కర్నాటక మద్యం, నాటుసారా నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో సెబ్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. పాత నేరస్తులు మళ్లీ నేరాలకు ఒడిగడితే కేసులతో పాటు బైండోవర్ చేయాలన్నారు. తరుచూ నేరాలకు పాల్పడే వారిపై రౌడీషీట్ తెరవడంతో పాటు, కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలన్నారు.



ఇద్దరు సభ్యులు మినహా తక్కిన అందరూ అధికార పక్షమే ఉన్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సమస్యల ప్రస్తావన ఏ మేరకు వస్తుందో చూడాల్సి ఉంది. నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ భవనంలో జరగనుంది. ఈ సమావేశానికి అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి జిల్లా పరిషత్ సభ్యులు, అధికారులు , ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. అంతా అధికారబలమేవున్న ఈ సమావేశంలో సమస్యల ప్రస్తావన ఏ మేరకు రానున్నాయన్నది నేడు జరిగే సమావేశంలో చూడాల్సి ఉంది.





సమస్యలు చర్చకొచ్చేనా..?

- ◆ సాయం కోసం రైతుల ఎదురుచూపు
- ◆ ఇళ్ల లబ్ధిదారులను వెంటాడుతున్న కష్టాలు
- ◆ నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- ◆ హాజరుకానున్న రెండు జిల్లాల అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పలు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రధానంగా వ్యవసాయ సంబంధమైన సమస్యలు అధికంగానున్నాయి. ఎప్పుడూ ఆకాశం వైపు ఎదురు చూసే రైతులు ఈసారి అధికంగా వర్షాలు పడ్డాయి. ఈ అధిక వర్షాలు రైతులను తీవ్ర నష్టాలపాలుజేశాయి. రెండు జిల్లాల పరిధిలో ఈ ఏడాది 16 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో పది లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగైంది. రెండు లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. మరో 70 వేల ఎకరాల్లో మిరప సాగైంది. ప్రధాన పంట వేరుశనగ దిగుబడి ఆశించినంత రాలేదు. పత్తి, మిరప పంటలకు తెగుళ్లు, నాసిరకం విత్తనాలు రైతులను నట్టేట ముంచాయి. తెగుళ్ల దెబ్బకు దిగుబడులూ తగ్గాయి. ఇంత భారీ నష్టాన్ని చవిచూసినా రైతుకు ప్రభుత్వం నుంచి ఏ మేరకు సాయం అందుతుందన్నది ఇప్పటి వరకు స్పష్టతలేదు. ఈ సర్వసభ్య సమావేశంలోనైనా రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం జరుగుతుందా.? లేదా.? అన్నది చూడాల్సి ఉంది.

ముందుకొచ్చిన ఇళ్ల స్థలాల సమస్య

రెండు జిల్లాల పరిధిలోనూ ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలకు సంబంధించిన సమస్యలు ప్రధానంగా ముందుకొచ్చాయి. లక్షకుపైగా ఇళ్లు మంజూరైనా రెండు జల్లాలోనూ కలిపి ఇప్పటికి నిర్మాణం పూర్తయినవి పది శాతంలోపే ఉంటున్నాయి. ఇప్పటికే లేఅవుట్లలో మౌలిక సదుపాయల కల్పన పూర్తవలేదు. ఇక స్థలముండి ఇంటి పట్టాలేని వారికి వెంటనే ఇస్తామని ప్రభుత్వమిచ్చిన హామీనూ ఇంత వరకు అమలు జరగలేదు. ఉరవకొండ, అనంతపురం, కల్లూరు, తదితర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఇంటి పట్టాలపై లబ్ధిదారుల్లోనూ ఆందోళన నెలకొంది.

సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడివక్కడే..

గడిచిన మూడేళ్ల కాలంలో సాగునీటి ప్రాజెక్టుల ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. దీంతో ఆయకట్టు రైతులకు అదనంగా పొందుతున్న ప్రయోజనం ఏమీ ఉండటం లేదు. పూర్తి చేస్తామన్న హంద్రీనీవా వెడల్పు పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. బిటిపి, పేరూరు ఎత్తిపోతల పథకాలు ఆగిపోయాయి. హెచ్ఎల్‌సి ఆధునీకరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కనీసం మరమ్మతకులకు సైతం హెచ్ఎల్‌సి నోచుకోవడం లేదు. ఇటువంటి అనేక సమస్యలు ప్రధానంగా ఉంటున్నాయి.

పింఛన్ల కోతపై కొనసాగుతున్న గుబులు

రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో పింఛన్లకు సంబంధించి తీసుకున్న చర్యలు గందరగోళం అయోమయంలోకి నెట్టాయి. కొంత మంది తమ అర్హతను నిరూపించుకోవాలంటే నోటీసులు జారీ చేసింది. రెండు జిల్లాల పరిధిలో సుమారు 20 వేల మందికి ఈ రకంగా నోటీసులు అందాయి. దీనిపై పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం కావడంతో తిరిగి పింఛన్లను యథావిధిగా ఇచ్చారు. అయితే ఈ నెలలో వారు తమ అర్హతను నిరూపించుకోవాలని ఆదేశాలున్నట్టు ప్రచారం సాగుతోంది. వీటితో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న మరిన్ని సమస్యలపై నేడు జరిగే జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఏమేరకు చర్చిస్తారన్న అంశంపై వేచి చూడాల్సి ఉంది. ప్రజలు మాత్రం ఈ సమావేశంలో అయినా సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి ఓ నిర్ణయం తీసుకుంటున్నారన్న గంపెడు ఆశతో ఎదురు చూస్తున్నారు.



రేషన్ బండి వద్ద బియ్యాన్ని తీసుకుంటున్న ప్రజలు

సంక్రాంతికీ చక్కెర లేదు..!

రేషన్ షాపుల్లో బియ్యంతో సరి

ప్రజాశక్తి-కదిరి అర్బన్



ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందిచే సరుకులు పేద కుటుంబాలకు ఎంతో ఆసరగా ఉంటాయి. అలాంటి రేషన్ వ్యవస్థ రానురాను నీరుగారిపోతోంది. ప్రస్తుతం రేషన్ షాపుల్లో కేవలం బియ్యాన్ని మాత్రమే ఇస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా అయినా చెక్కర, గోధమ పిండి, కందిబేడలు ఇస్తారని ప్రజలు భావించారు. గతంలో సక్రాంతి కానుక పేరుతో రేషన్ షాపుల ద్వారా పలు నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేసేవారు. ఈ సారి కనీసం చెక్కర కూడా ఇవ్వకుండా బియ్యంతోనే సరిపెడుతున్నారు. దీంతో ప్రజలు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం పండుగ పూట అయినా చెక్కర ఇవ్వకపోవడం ఏమిటంటూ నిట్టూర్పు విడుస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో పండుగ పూట తినుబండారాలు చేసుకోవడం పేదలకు శక్తికి మించిన పనిగా మారింది. ఇలాంటి సమయంలో నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వార పంపిణీ చేయకుండా ప్రభుత్వం ఇలా చేయడం సరికాదంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సంక్రాంతి పండుగ నేపథ్యంలో రేషన్‌కార్డు దారులు అందరికీ ఉచితంగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న సిఐటియు నాయకులు

అంగన్‌వాడీలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

హిందూపురం : అర్హత ఉన్న అంగన్‌వాడీలకు ప్రభుత్వ జిఒ మేరకు పదోన్నతులు కల్పించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో కలెక్టర్ బంసత్‌కుమార్‌ను సిఐటియు ఆధ్వర్యంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ హెల్పర్లు, వర్కర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. అయితే ఇందులో కొన్ని సెంటర్ల వారు కోర్టుకెళ్లారన్నారు. ఇంతవరకు ఎలాంటి తీర్పు రాలేదన్నారు. కానీ పోస్టుల భర్తీకి ధరఖాస్తులు తీసుకుంటున్నారన్నారు. కోర్టు తీర్పు ఇచ్చిన దానికి కట్టుబడి ఉండాలని, అదేవిధంగా మీకు అనుకూలంగా వస్తే మీరు ఉండవచ్చు, లేనిపక్షంలో వారికి అనుకూలంగా వస్తే మీరు ఉద్యోగం నుండి వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉండాలని లేఖలు తీసుకుంటున్నారన్నారు. పదోన్నతులు కల్పించి, కోర్టు తీర్పు వచ్చే ఎలాంటి నియామకాలు చేపట్టరాదని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, కోశాధికారి శిరీషా, సెక్టార్ లీడర్ వరలక్ష్మి, సిఐటయు పట్టణ ఉపాధ్యక్షులు అత్తార్ బాబా, కమిటీ సభ్యులు చంద్ర, కల్లూరు స్టాండ్ యూనియన్ కార్యదర్శి రఫీ, నాగేష్, నవీన్, నారాయణప్ప, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారిణి ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, పీఈటీ

ధర్మవరం టౌన్ : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక కావడం హర్షణీయమని మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మినారాయణరెడ్డి, పీఈటీ వీర తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక సుందరయ్యనగర్‌లోని శ్రీగణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారిణి ఐశ్వర్యను అభినందించారు. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన అండర్-14 విభాగంలో ఐశ్వర్య ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారుడు



రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అసోషియేషన్ ప్రతినిదులు

ధర్మవరం టౌన్ : విశాఖపట్నంలోని అనకాపల్లిలో నేటి నుంచి జరగనున్న అండర్-9 బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరానికి చెందిన క్రీడాకారుడు సిరాజ్ ఎంపికైనట్టు ధర్మవరం బాస్కెట్‌బాల్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆత్మీయట్రస్టు, ఛైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. గతనెల డిసెంబర్‌లో అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు తరపున సిరాజ్ పాల్గొని అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. దీంతో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, ఉపాధ్యక్షుడు నిమ్మ చంద్రశేఖర్, కోచ్ సంజయ్ కుమార్, తదితరులు సిరాజ్‌ను అభినందించారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

'నాడు-నేడు'తో అభివృద్ధి చేయాలి - ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోకాళ్లపై అర్ధనగ్నంగా కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక సర్వే నిర్వహించి పరిష్కరించాలని ఉన్నతాధికారులకు వినతులు ఇచ్చినప్పటికీ స్పందించిన పాపానపోలేదన్నారు. కరువుకి నిలయమైన సత్యసాయి జిల్లాలో వెనకబడిన బీసీ, ఎస్టీ, ఎస్సీ కుటుంబాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు సంక్షేమ హాస్టళ్లలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఒకవైపు ప్రభుత్వం పెద్దఎత్తున సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధి చేస్తున్నట్టు చెబుతున్నా ఆచరణలో మాత్రం కనిపించలేదన్నారు. 2018లో ఇస్తున్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలను ఇప్పటికీ ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. కరోనా అన్ని రకాల సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. దీంతో ప్రభుత్వ ఇస్తున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్, కాస్మోటిక్‌లు అందించలేకపోతునాన్రారు. నాడు-నేడు పథకంతో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని చెబుతూ పాఠశాల గోడలకు రంగులు వేసి ఇదే అభివృద్ధి అని చెబుతున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో అద్దె భవనాల్లో నడుస్తున్న సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దౌర్భాగ్యంగా ఉందన్నారు. కొన్నింటిలో మంచినీరు, మరుగుదొడ్లు, నాణ్యమైన భోజనం లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్షకుమార్, భగత్, నిహాల్, అభి, మహేష్, బాబా ఫక్రుద్దీన్, మహాలింగ, నందీష్, సాదికబాషా, నవీన్, కోదండరాం, లోకేష్, సూర్య, నటరాజ, గిరీష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్‌లో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సౌకర్యాలు కల్పించలేకపోతే ఆసుపత్రిని మూసేయండి..

24 గంటలు గడచినా సరైన వైద్యం అందించకపోతే ఎలా..

కలెక్టర్‌ను నిలదీసిన రోగుల బంధువులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు సరైన వైద్యం అందించలేనప్పుడు ఆసుపత్రిని మూసేయాలని రోగుల బంధువులు కలెక్టర్ బసంత్‌కుమార్‌ను నిలదీశారు. శుక్రవారం స్థానిక జిల్లా అసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, కలెక్టర్ బసంత్‌కుమార్ సమావేశం నిర్వహించారు. విషయం తెలుసుకున్న అమరాపురం మండలం కె.శివరాం గ్రామానికి చెందిన రోగుల బంధువులు రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదంటూ ఆందోళన చేపట్టారు. దీంతో ఆసుపత్రిలో కొద్దిసేపు హైటెన్షన్ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న సిఐలు ఇస్మాయిల్, వెంకటేశ్వర్లు, సిబ్బందితో చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. అయినా వినకుండా కలెక్టర్ బయటకు రావాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రోగుల బంధువులు మాట్లాడుతూ అమరాపురం మండలం కె.శివరాం గ్రామానికి చెందిన 26 మంది కూలీలు గురువారం ఉదయం ట్రాక్టర్‌లో కూలి పనులకు వెళ్తూ బోల్తా పడిన ఘటనలో గాయపడి మెరుగైన చికిత్స కోసం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి వచ్చామన్నారు. వీరిలో ఐదుగురిని మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రులకు తరలించారని, మిగతావారు ఇక్కడే ఉన్నారన్నార. వీరందరికీ 24 గంటలు గడుస్తున్నా వైద్యులు మెరగైన వైద్యం అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను కలెక్టర్‌కు వివరించడానికి వస్తే అడ్డుకుంటున్నారన్నారు. ఎట్టకేలకూ పోలీసులు కలెక్టర్‌తో మాట్లాడేందుకు ఇద్దరికి అనుమతిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో మాట్లాడుతూ స్థానిక వైద్యులు మెరుగైన వైద్యం అందించకపోగా సిటీ స్కానింగ్ అని బయటకు రాసి ఇస్తున్నారన్నారు. సీటి స్కాన్ చేయడానికి బయట రూ.8వేలు అడుగుతున్నారని, కూలీ పని చేసుకునే తమకు అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుందని వాపోయారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ వెంటనే రోగుల కే షీట్‌లు తెప్పించి పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతుండగా రోగుల బంధువులు మాట్లాడేందుక యత్నించారు. వారి మాటలు కలెక్టర్ వినకపోవడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం కలెక్టర్ స్పందిస్తూ ఎవరూ ఆధైర్యపడకండని, అందరికీ మెరుగైన వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చారు. సమావేశం అనంతరం ప్రమాదంలో గాయాపడి చికిత్స పొందుతున్న వారిని కలెక్టర్ పరామర్శించారు. ఘటనపై ప్రజాశక్తి కలెక్టర్‌ను వివరణ కోరగా ప్రమాదం జరిగిన తీరును సంబంధిత మండల తహశీల్దార్‌తో నివేదిక తెప్పించుకుని చూసి మృతిచెందిన వ్యక్తికి ప్రమాద బీమా ఉంటే రూ.5లక్షలు వెంటనే మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఆందోళనకారులతో చర్చిస్తున్న పోలీసులు

సంతకాలు చేసినట్టు నిరూపిస్తే రాజీనామా చేస్తాం..

లేకుంటే మీరు చేస్తారా..

సమాధుల కూల్చివేతపై టిడిపి నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని గాంధీ నగర్‌లో ఉన్న ఖబరస్తాన్‌లో సమాధులను 43 మసీదుల కమిటీ సభ్యులు సంతకాలు చేసినందునే సమాధులు తొలగించారని చెబుతున్న వైసిపి నాయకులు తాము సంతకాలు చేయకుండా రాజీనామా చేస్తారా..? అనిటిడిపి హిందూపురం పార్లమెంట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్, మైనార్టీ నాయకులు సవాల్ విసిరారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిజంగా అన్ని కమిటీల సభ్యులు సంతకాలు చేసినట్లు నిరూపిస్తారా.. అన్నారు. సమాధుల తొలగింపుపై ముస్లింలోనే తీవ్ర వ్యతిరేక కనిపిస్తోందన్నారు. మత పెద్దలు కూడా వీటిని తప్పుపడుతున్నారన్నారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఖబరస్తాన్‌కు వచ్చి కూల్చిన సమాధులను పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శిస్తే రాజకీయం చేసున్నాడని విమర్శించడం సిగ్గుచేటన్నారు. మీరు నిజంగా 43 మసీదుల కమిటీ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటే ముస్లిం మతపెద్దలు ఎందుకు వ్యతిరేకిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైని వైసిపి నాయకులు తప్పులు తెలుసుకుని ముస్లింలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ముస్లిం మైనార్జీలు రహింబాషా, పరానా, బాబూబాన్, షాషావలి, పరూఖ్, షమీర్, రాళ్లపల్లి కుళ్లాయప్ప, బాబాఫకృద్దీన్, మహిళా నాయకురాలు సాహెబ్బీ, బీబీ, మున్నీ, ముశీన, బాబావలి, మహబూబ్‌బాషా, ఇర్షాద్, మాబు , షెకావలి, ఉస్మాన్, అఖిల, తదితరులు పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న టిడిపి ముస్లిం నాయకులు

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

హిందూపురం : పురపాలక సంఘం పరిధిలోని 31వ వార్డు కరుణాపురం ఈసి బాలుర పాఠశాలలో ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ శుక్రవారం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలంటే సాంకేతిక విద్య చాలా అవసరమన్నారు. అందుకోసమే సిఎం జగన్ 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వార్డు కౌన్సిలర్ చిన్నమ్మ, కౌన్సిలర్లు నాసీరాబాను, నాగేంద్రబాబు, వైసిపి నాయకులు నాగరాజు, శ్రీరాములు, సోమశేఖర్‌రెడ్డి, మోహన్‌బాబు, షఫీ, ఇమ్రాన్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

12న హిందూపురంలో జాబ్‌మేళా



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

హిందూపురం : పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈనెల 12న ఏర్పాటు చేయనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ సూచించారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే వేదికపై వివిధ కంపెనీల ప్రతినిధులు వచ్చి ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

లేపాక్షి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. అందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమం లో విజిలెన్స్ డివిజన్ ఇంజనీర్ యోగేష్ బాబు, ఎస్ఐ ఫణింద్ర నాథ్ రెడ్డి. డాక్టర్ చిరంజీవి, సిబ్బంది సుబ్రహ్మణ్యం, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ జోష్ను కోరారు. మండలంలోని పెడపల్లి గ్రామంలో శుక్రవారం క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, రాకుండ తీసుకోవలసిన జాగ్రత్తలు, ముందస్తు గుర్తింపు, చికత్స గురించి, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఫ్యామిలీ ఫీజిషియన్ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నాగరాజు నాయక్, సిహెచ్ఒ నగేష్, స్టాఫ్ నర్సులు గీతలక్ష్మి ,పద్మ,అమ్మజి, సూపర్ వైజర్లు వెంకట రమణ చంద్రకళ, నాగరత్న, ల్యాబ్ టెక్నీషియన్ చెన్న కేశవ తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన

రొద్దం : మండలంలోని ఎల్.తిమ్మాపురం, చిన్నమంతూరు గ్రామాలలోని రైతుల పంటపొలాలను కదిరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు వేమన, నీలిమ, పెనుగొండ సహాయ వ్యవసాయ సంచాలకులు స్వయంప్రభ శుక్రవారం పరిశీలించారు. మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, పప్పుశనగ, ఎండు మిరప పంటలు పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నివేదిత, విస్తరణ అధికారి అంజాద్, ఆర్‌బికె అధికారులు యోగేష్, నరేంద్ర, జ్యోతితో పాటు రైతులు పాల్గొన్నారు.

జీవో 1ని రద్దు చేయాలి

ఓబుల దేవర చెరువు : ప్రతిపక్షాలను అణగదొక్కేందుకు వైసీపీ ప్రభుత్వం అర్ధరాత్రి జారీ చేసిన జీవో నెంబర్ 1ని వెంటనే రద్దు చేయాలని టిడిపి, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కదిరి–హిందూపురం ప్రధాన రహదారిపై ఆ పార్టీల నాయకులు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో బ్రిటిష్ కాలం నాటి జీవోలను తీసుకురావడం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా జీవో ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నిజాం, మండోజీ ఆరిఫ్ ఖాన్, మండ్యెం చాంద్‌బాషా, పొగాకు షబ్బీర్, మల్లాపల్లి ఓబుళ రెడ్డి, మోపూరి అంజనప్ప, ముద్దులపల్లి శ్రీనివాసులు, పీట్ల సుధాకర్,హనుమంత్ రెడ్డి, సిపిఐ అంజి, చలపతి నాయుడు, పూల శ్రీనివాసులు, రత్నా బాయి తదితరులు పాల్గొన్నారు .

తనకల్లు : రాష్ట్రంలో ర్యాలీలు రోడ్ షోలు సభలు సమావేశాలు జరగకూడదంటూ చీకటి జీవోను తీసుకువచ్చిందని టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు నిరంకుశ నిర్ణయాలతో పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా ప్రజా సమస్యలపై టిడిపి పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు.

కదిరి టౌన్ : రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 1ని తక్షణం ఉపసంహరించుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తాలిబాన్ల పరిపాలన సాగుతోందని విమర్శించారు. తక్షణం ఈ జీవోను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో ప్రజలే తగిను బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, నాయకులు మున్నా, రంజిత్, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : ఇటీవల అయ్యప్ప దర్శనం వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కదిరి రూరల్ మండలం చౌట తండాకు చెందిన శ్రీరాములు నాయక్ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులకు ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే తండ్రి చిన్న గంగిరెడ్డి చేతుల మీద రూ. 25 వేల రూపాయలను మృతుని కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, జెడ్పీటీసీ కృష్ణానాయక్, మండల కన్వీనర్ ప్రకాష్, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, ఎంపిటిసి నరసింహులు, సర్పంచి శ్రీనివాస్ నాయక్, భీముడు నాయక్, కళ్యాణ్ కుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

నల్లచెరువు : మండలానికి నూతనంగా మంజూరైన 156 పింఛన్లను కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్లు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, జెడ్పీటీసీ అనితమ్మ, సర్పంచి పంచరత్నమ్మ, ఎంపీడీవో శకుంతలతో పాటు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్

పెనుకొండ : ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన క్యాలెండర్‌ను పెనుకొండ సబ్ కలెక్టర్ కె. కార్తీక్ శుక్రవారం ఆవిష్కరించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదంతో ప్రజాసమస్యలను ప్రభుత్వం అధికారులు దృష్టికి తీసుకువస్తూ సమస్యల పరిష్కారం కోసం ప్రజాశక్తి దినపత్రిక విశేష కృషి చేస్తోందని తెలిపారు. ప్రజాశక్తి మరింత అభివృద్ధి చెందాలని అకాక్షించారు. ఈ కార్యక్రమంలో రిపోర్టర్ కె. నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి గిరి ప్రదర్శన

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి గిరి ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని గణేష్ గేట్ నుంచి ప్రత్యేక రథంలో సత్యసాయి చిత్రపటం ఉంచి ఊరేగించారు. స్థానిక భక్తులతో పాటు విదేశీ భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ప్రతి పౌర్ణమి రోజు ప్రత్యేక గిరి ప్రదర్శన జరుగుతూ వస్తోంది.

తాగునీటి సమస్య పరిష్కారం

తనకల్లు : మండలంలోని గేమే నాయక్ తండాలో నెలకొన్న తాగునీటి సమస్యను మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పరిష్కరించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన తక్షణమే రూ.1. 50 లక్షల విలువగల సామాగ్రిని మోటార్ బోర్ పైప్ లైన్, స్టార్టర్, కేబుల్ వైరు తదితర సామగ్రిని సర్పంచి కాంతమ్మ భర్త ఉత్తన్న నాయక్ కి అందించారు. దీంతో గేమే నాయక్ తండా వాసులు కందికుంటకు కృతజ్ఞతలు తెలిపారు.

కళాశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

పెనుకొండ : స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో భోగి, మకర సంక్రాంతి, కనుమ విశిష్టతను తెలిపే విధంగా ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతియ స్థానాల్లో నిలచిన వారికి బహుమతులను శనివారం అందజేస్తామని ప్రిన్సిపల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయప్ప, అధ్యాపకులు శ్రీదేవి, కె ప్రతాప్, కళావతి, ఓబులేసు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి కలిసికట్టుగా చర్చించుకుందాం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న ఖబరస్తాన్‌లో కొందరు అవగాహన రాహిత్యం వల్ల జరిగిన సమాధుల తొలగింపు తప్పేనని ముస్లిం మత పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈమేరకు శుక్రవారం పలువురు మతపెద్దలు మైనార్టీ నాయకుడు నాగూరుస్సేన్‌ను కలిసి చర్చించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొందరి అవగాహనా రాహిత్యం వల్ల గందరగోళంగా మారిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి జరగకుండా మతసామరస్యంగా చర్చించుకుందామని కోరారు. 43 మసీదుల సభ్యులతో సంతకాలు చేయించుకున్నామని చెబుతున్నా, ఇదంతా అవాస్తవమన్నారు. కొందరితో సంతకాలు చేయించుకుని అందరూ చేశారని చెప్పడం మంచిది కాదన్నారు.

వైద్య విధానంలో విప్లవాత్మక మార్పులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

రానున్న మరో మూడు...నాలుగు నెలల్లో వైద్య విధానంలో రాష్ట్రంలో భారీ మార్పులు వస్తాయని జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. దాదాపు 15నెలల అనంతరం జిల్లా అసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా 30 అంశాలతో కూడిన అజెండాను మెడికల్ సుపరింటెండెంట్ రోహిల్‌కుమార్ ప్రవేశ పెట్టారు. దీనిపై సమగ్రంగా చర్చించి ఆమోదించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతు అమరాపురంలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ విభాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని గుర్తించామని చెప్పారు. ఒక డ్రిల్లింగ్ మిషన్ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆరోగ్యశ్రీ బడ్జెట్లో వస్తున్న నిధుల్లో కానీ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల్లోకానీ మొదటి ప్రాధాన్యత కింద డ్రిల్లింగ్ మిషన్ కొనాలని నిర్ణయించామన్నారు. వచ్చే అభివృద్ధి కమిటీ సమావేశానికి ముందుగానే ఆసుపత్రిలో అవసరమైన ప్రతిపాదనలకు బడ్జెట్ ఎంత ఉంది అనేది చూసుకుని ప్రతిపాదనలు పూర్తిగా సిద్ధం చేయాలన్నారు. ఆస్పత్రిలో వీలైనంత తొందరగా సిటీ స్కానింగ్ సేవలను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి, డిసిహెచ్ తిప్పేంద్రనాయక్, అభివృద్ధి కమిటీ మెంబర్లు గంగిరెడ్డి, ఐఎంఎ మెంబర్ డాక్టర్ వెంకటరమణ, ఎసిపి ఆనంద్‌కుమార్, ధనలక్ష్మి, డాక్టర్ శివకుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


వృద్ధురాలితో మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

కదిరి అర్బన్ : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ, కుటాగుళ్ల 2,3 సచివాలయం పరిధిలోని చెరువు కట్ట వీధి, రామస్వామి వీధి, దేవాలయం వీధి, ఎస్సీ కాలనీ, ఆటోనగర్, మెయిన్ రోడ్‌లో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని అక్కడే ప్రభుత్వ అధికారులతో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్ గంగాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, , కౌన్సిలర్లు మహమ్మద్, ఆవుల స్వామి, మురళి, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామని శాసనసభ్యులు శంకర్ నారాయణ తెలిపారు మండలంలోని పాపిరెడ్డి పల్లి, గంగాదేవి పల్లి, బూదిలి తండాలో శుక్రవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ లక్ష్మీనరసప్ప యాదవ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సర్పంచి రామాంజనేయులు, ఎంపీటీసీ మంజునాథ, జెడ్పీటీసీ జయరాం నాయక్, ఎంపీపీ ప్రమీల, సర్పంచులు సరోజా నాగనాయక్, ప్రభాకర్ రావు, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలం పరిధిలోని విభూతి పల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇక్బాల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, మాజీ సమయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ బాణాల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచి మంజునాథ్, తహశీల్దార్ బాబు, ఎంఇఒ నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంతో విద్యార్థులకు మేలు


శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

హిందూపురం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సిబిఎస్ఇ సిలబస్ విద్య ఒక వరం అని కోర్స్ డైరెక్టర్ గంగప్ప పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానంద మిలీనియం పాఠశాలలో ఎంపిక చేసిన పాఠశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో గంగప్ప మాట్లాడుతు ప్రభుత్వ నిర్ణయంతో నిరు పేద విద్యార్థులకు ఖరీదైన విద్య అందుబాటులోకి రానుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన చేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. శిక్షణలో సందేహాలను నిపుణులు వినీతా, రెజీనా, సమగ్ర శిక్ష నుండి వచ్చిన సర్వేశ్వరి, డా.లక్ష్మీనారాయణలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కోఆర్డినేటర్ రమేష్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఎఎంఒ మహేంద్ర రెడ్డి పర్యవేక్షించారు.

కదిరి టౌన్ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంలకు, ఉపాధ్యాయులకు జరుగుతున్న రెండు రోజుల శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసినట్లు ఎంఇఒ చిన్నకృష్ణ తెలిపారు. సిబిఎస్ఇ అమలుకు జిల్లాలో 49 పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసిందని చెప్పారు. పేద విద్యార్థులు మెరుగైన విద్య అభ్యసించడానికి విద్యార్థులకు అవకాశం లభించిందన్నారు. సీబీఎస్ఈ సిలబస్‌తో పది, ఇంటర్ పూర్తి చేస్తే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని చెప్పారు. ఈ పాఠశాలల నిర్వహణ కు సంబంధించి ఉపాధ్యాయులకు సందేహాలను నిపుణులు ఈశ్వరి, సురేష్, నరసింహ నివృత్తి చేశారన్నారు.


విద్యార్థులు, గైడ్ టీచర్లతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు

జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ధనాపురం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పరిగి

జాతీయస్థాయి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో పరిగి మండలం ధనాపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పెట్రోలియం కన్సర్వేషన్ రీసెర్చ్ అసోసియేషన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో పరిగి మండలం, ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గానశ్రీ, అలేఖ్య, దీక్షిత, మంజుళ ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. వీరికి ఒక్కొక్కరికి రూ.4వేలు చొప్పున మొత్తం రూ. 16వేలు , నగదు బహుమతిని నిర్వాహకులు అందజేసినట్లు చెప్పారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి మెరుగైన సూచనలు సలహాలు అందించిన గైడ్ టీచర్లు సుకన్య, విజయభార్గవిలను ప్రధాన పాధ్యాయులు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-హిందూపురం


జిల్లా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. శుక్రవారం నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి వచ్చిన కలెక్టర్‌ను ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అసుపత్రిలో సిటీ స్కానింగ్ మరమ్మతుకు గురై 5 సంవత్సరాలైందని ఇంత వరకు పట్టించుకోలేదన్నారు. దీంతో పేద రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీంతో పాటు మాత శిశు అసుపత్రిలో గైనకాలిస్టులు పూర్తి స్థాయిలో లేరని నెలకు 600 మంది వస్తే అందులో 400 మంది వరకు రెఫర్ చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఉమర్ ఫారూక్ ఖాన్, నాజీమ్ పటేల్, బిలాల్, అమీన్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వైసిపి హయాంలో నిరుద్యోగ యువతకు అన్యాయం

కదిరి టౌన్ : రాష్ట్రంలోని నిరుద్యోగ యువకులను వైసిపి ప్రభుత్వం మోసం చేసిందని జనసేన మై ఫోర్ట్ మహేష్ విమర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు మద్దతుగా జన సేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ నెల 12 న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో యువశక్తి పేరుతో భారీ బహిరంగ సభను తలపెట్టారన్నారు. అందులో భాగంగా జన సేన పార్టీ నాయకులు మై ఫోర్స్ మహేష్ రాయలసీమ యువశక్తి ప్రచార రథానికి ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ అధ్యక్షులు అమర్ నారాయణ, బాల సముద్రం ఎంపీటీసీ అమర్, కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యులు లక్ష్మణ కుటాల, నాయకులు రాజేంద్ర ప్రసాద్,కాయల చలపతి, శోభ, అంజిబాబు, కిన్నెర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం


స్థానిక నాయకులతో 'పల్లె'

కొత్తచెరువు : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైనదని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాలలో శుక్రవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పల్లె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన ప్రజావ్యతిరేక కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు బండ్లపల్లి రాజు, డిపో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారథి విమర్శించారు. శుక్రవారం మండలంలోని నారానాగేపల్లిలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో బికె పాల్గొన్నారు. ప్రజాసమస్యలపై దృష్టి సారించని పెనుకొండ ఎమ్మెల్యే ఏ ముఖం పెట్టుకుని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తిరుగుతున్నారని నిలదీశారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై ప్రజలు పాలకులను నిలదీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, పార్లమెంట్ అధికార ప్రతినిధి నరసింహులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నాయకులు చిన్నప్పయ్య, మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. శుక్రవారం మండలంలోని మెలవాయి పంచాయతీలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చీకటి జీవోలను తీసుకువచ్చి టీడీపీ సభలను ర్యాలీలను అడ్డుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు మనోహర్, నాగరాజు, పాండు రంగప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : ధర్మవరం చెరువులోని మొదటి మరువ వద్ద మహిళ దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని దేవనగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ భార్య ఆదిలక్ష్మి(57) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేది. ఇందులో భాగంగా పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంది. అయినా జబ్బు నయం కాలేదు. ఈక్రమంలో పింఛన్ తెచ్చుకుంటానంటూ ఈనెల 2న కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చింది. అప్పటి నుంచి ఆదిలక్ష్మి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. అయినా కనిపించకపోవడంతో ఆదిలక్ష్మి కుమారుడు నాగరాజు ఈనెల 4న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈనేపథ్యంలో శుక్రవారం ధర్మవరం మొదటి మరువు వద్ద శవమూ తేలడంతో గమణించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ మహమ్మద్ రఫీ సిబ్బందితో చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. వెంటనే మృతురాలి కుమారుడు నాగరాజుకు సమాచారం అందించగా ఆయన వచ్చి తన తల్లిగా గుర్తించాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పతికి మృతదేహాన్ని తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

చిలమత్తూరు : ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం కోడూరు వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గార్మెంట్స్ కు మహిళ కార్మికులను తరలించే ఆటోలలో నిర్దేశిత సంఖ్య కన్న ఎక్కువ మందిని తీసుకెళ్లరాదన్నారు. అనంతరం మహిళా కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ సుజాత, పోలీసులు పాల్గొన్నారు.

బైక్ రైడర్లపై కేసు నమోదు

పెనుకొండ : పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఇష్టారాజ్యంగా ద్విచక్ర వాహనాలు రైడింగ్ చేస్తున్న ఎనిమిది మంది పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు శుక్రవారం తెలిపారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా స్టంట్ లు వేస్తు రైడింగ్ చేస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు.

కారులో మంటలు ... తప్పిన ప్రమాదం

గోరంట్ల : మండలంలోని బూదిలి పంచాయతీ గొల్లపల్లి సమీపాన కారులో మంటలు చెలరేగి కారు మొత్తం కాలిపోయింది. సిఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాలు... చిలమత్తూరు మండలం చాగలేరు పంచాయతీ చానాగానిపల్లికి చెందిన రామచంద్రారెడ్డి అతని భార్య పద్మావతమ్మ, మనువడుతో కలసి కారులో హిందూపురం వెళ్లి తిరిగి తమ స్వగ్రామానికి బయలుదేరారు. వీరి కారు గొల్లపల్లి వద్దకు రాగానే కారులో మంటలు చెలరేగాయి. దీంతో కారులో ఉన్నవారు దిగిపోయారు. అనంతరం కారు పూర్తిగా కాలిపోయింది.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

పుట్టపర్తి అర్బన్ : తెలంగాణ రాష్ట్రంలోని హనుమకొండలో నాయి బ్రాహ్మణ సోదరుడిపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సత్యసాయి జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం జిల్లా ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాల్యవంతం మారుతి ప్రసాద్ మాట్లాడుతూ హనుమకొండలో సెలూన్ దుకాణం నడుపుకుంటున్న నాయి బ్రాహ్మణ సోదరుడిపై కొందరు దుండగులు అమానుషంగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దుండగులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కుమ్మెత రమేష్, రామకృష్ణ, నాయపు నాగరాజు(రాజా), ప్రవీణ్ కుమార్, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

రొద్దం : మండలంలోని ఎం.కొత్తపల్లి పంచాయతీ టిడిపి కన్వీనర్ గౌరాజుపాల్లి సోమశేఖర్ (35) గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నియోజకవర్గం కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, కన్వీనర్ నరహరి, మాధవ నాయుడు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదాలను నివారించండి : సిపిఎం

పెనుకొండ : పట్టణంలో రోడ్డు ప్రమాదలను నివారించి ప్రజలను కాపాడాలని సిపిఎం నాయకులు కోరారు. ఈసందర్భంగా నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ రమేష్ బాబుకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రమేష్ మాట్లాడుతూ పట్టణంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా కియ పరిశ్రమకు సంబంధించిన బస్సులు అతివేగంగా వస్తున్నాయని దీనివల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శించారు. కియా బస్సుల అతివేగాన్ని నియంత్రించి రోడ్డు ప్రమాదాలు నివారించాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో కియ పరిశ్రమ ముందు ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, బాబావలి, వజ్రం నాగప్ప, రెడ్డప్ప రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి 60 ప్రత్యేక బస్సు సర్వీసులు

పుట్టపర్తి అర్బన్ : సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పుట్టపర్తికి 60 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి టి. మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10 నుంచి 14 వరకు ఈ సర్వీసులు నడుస్తాయన్నారు. హైదరాబాదు నుంచి పది సర్వీసులు, బెంగళూరు నుంచి 20 సర్వీసులు, తిరుపతి నుండి 10 సర్వీసులు, విజయవాడ నుంచి 5 సర్వీసులు అనంతపురం పుట్టపర్తికి 15 లోకల్ బస్సులు నడుపుతామన్నారు. ప్రయాణికులు ముందుగా ఆన్లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. అలాగే తిరుగు ప్రయాణాలకు ఈనెల 15 నుంచి 18 వరకు ఈ సర్వీసులు నడుస్తాయన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సకాలంలో మెరుగైన వైద్యం : ఎమ్మెల్యే

కదిరి అర్బన్ : వైద్యులు రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్ధారెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమావేశ మందిరంలో హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిని రాష్ట్రంలోని ప్రథమ స్థాయిలో తీసుకొచ్చిన ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు ఆసుపత్రి సిబ్బందికి, శానిటరీ సిబ్బందిని అభినందించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. ఆసుపత్రి నుండి రిఫరెన్స్ కేసులను సాధ్యమైనంత వరకు తగ్గించే విధంగా చూడాలన్నారు. రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని దానికి తగ్గట్టు వైద్యులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో గల ఆసుపత్రి భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ ప్రసాద్, నాగమల్లు, నజీమున్నీసా, మధుసూదన్ రెడ్డి, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే